క్లుప్తంగా

భక్తాంజనేయస్వామి ఆలయంలో పూజలు

చాగల్లు: హనుమత్ వ్రత మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం చాగల్లు భక్తాంజనేయ స్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. పురోహితుడు శివసీతారామశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి పలు రకాల పండ్లు, పుష్పాలతో సహస్ర నామార్చన, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు.అధిక సంఖ్యలో భక్తులు దేవాలయానికి చేరుకుని పూజలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న పూజలు ముగిశాయి.

వజ్ర వనిత వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సేవలు

కొవ్వూరు: స్థానిక వజ్ర వనిత వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణం బయట స్థానికులు కూర్చోవడానికి వీలుగా సిమెంట్ బెంచీ ఏర్పాటు చేశారు. క్లబ్ సభ్యులందరికీ ప్లాస్టిక్ స్టూల్స్ అందజేశామని క్లబ్ అధ్యక్షురాలు మద్దుల వెంకటలక్ష్మి తెలిపారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు, నాయకులు మద్దుల సత్యనారాయణ, వలివేటి ప్రసాద్, వంకాయల శివ రామకృష్ణ, కాకి అనిల్ సూర్య, క్లబ్ కార్యదర్శి నాగుబండి దివ్య, కోశాధికారి గ్రంధి సంజన తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరులో మెప్మా బజార్ ప్రారంభం



మెప్మా బజార్ స్టాల్స్‌ను పరిశీలిస్తున్న చైర్ పర్సన్ బావన రత్నకుమారి

కొవ్వూరు: తీసుకున్న రుణాలతో స్వయం సహాయక సంఘాల మహిళలు ఉపాధి మార్గాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని మునిసిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయపడుతోందన్నారు. సున్నా వడ్డీ, డ్వాక్రా రుణాలు, ఉపాధి కోసం బ్యాంకు రుణాలతో పాటు ఆసరా, చేయూత వంటి పథకాల ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తుందన్నారు. టౌన్ మిషన్ కో–ఆర్డినేటర్ (టీఎంసీ) జేవీవీఎన్ భవాని, సీఆర్పీలు పాల్గొన్నారు.

దుర్గమ్మ విగ్రహంతో గ్రామోత్సవం



గ్రామోత్సవంలో గరగ నృత్యాలు

తాళ్లపూడి: అన్నదేవరపేట బీసీ కాలనీలోని కనదుర్గమ్మ వారి ఆలయాన్ని సుమారు రూ.10 లక్షల వ్యయంతో పునఃనిర్మించారు. ఈ ఆలయంలో ప్రతిష్ఠించనున్న దుర్గాదేవి విగ్రహాన్ని శుక్రవారం ట్రాక్టర్‌పై ఉంచి, గరగ నృత్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్తులు, దాతల విరాళాలతో గౌడ సామాజిక వర్గం వారు ఈ ఆలయాన్ని నిర్మించారు. జనవరి ఒకటి, రెండు, మూడు తేదీల్లో ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, అనంతరం భారీ అన్నదానం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

తాడిపూడి లిఫ్ట్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత



తానేటి వనిత

కొవ్వూరు: తాడిపూడి ఎత్తిపోతల పథకం నిర్వహణకు ఐదు విభాగాల్లో పనిచేస్తున్న 27 మంది అవుట్ సోర్సింగ్ సిబ్బందిని అబ్‌కాస్ (ఏపీసీవోఎస్) పరిధిలో చేర్చి నియామక ఉత్తర్వులు జారీ చేసినట్టు రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత శుక్రవారం ప్రకటించారు. వారిలో ఎనిమిది మందిని ఎలక్ట్రీషియన్స్‌గా, మరో ఎనిమిది మందిని మెకానిక్‌లుగా, ఐదుగురు వాచ్‌మన్‌లుగా, ఐదుగురిని హెల్పర్లుగా, ఒకరిని గార్డెనర్‌గా నియమించినట్టు వివరించారు. వీరికి నెలకి రూ.15 వేల నుంచి రూ.18,500 వరకూ స్థాయిని బట్టి వేతనం చెల్లిస్తారన్నారు.

కొండెక్కిన కూరగాయల ధరలు

దేవరపల్లి: కూరగాయల ధరలు కొండెక్కాయి. ఏ కూరగాయ కొనాలన్నా కిలో రూ.100 పైనే పలుకున్నాయి. మిచాంగ్ తుపాన్‌కు కూరగాయల పంటలు దెబ్బతినడం వల్ల ధరలు పెరిగాయని వ్యాపారులు అంటున్నారు. శుక్రవారం మార్కెట్లో ధరలు ఈ విధంగా ఉన్నాయి. కిలో ఉల్లిపాయలు రూ.40, వంకాయలు రూ.100 నుంచి రూ.140, బెండకాలయలు రూ.80, దొండకాయలు రూ.70, దోసకాయలు రూ.60, కాకరకాయలు రూ.80, బంగాళాదుంపలు రూ.50, పచ్చిమిర్చి రూ.80 పలుకుతున్నాయి. ఆకుకూరల ధరలు కూడా పెరిగాయి.

‘ఉపాధి’లో అన్నీ అవకతవకలే

- అసమగ్రంగా రికార్డులు
- మస్టర్లపై సంతకాలు లేవు
- మండలంలో రూ.12 లక్షల మేర అవినీతి
- డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ జగదాంబ
- స్పాట్‌లో రూ.1.69 లక్షల రికవరీ
- పెరవలి మండల ఉపాధి పనుల సామాజిక తనిఖీ



పెరవలి ఉపాధి సామాజిక తనిఖీ ప్రజా వేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ జగదాంబ

పెరవలి: ఉపాధి హామీ పనులను అవినీతి మయంగా మార్చేశారని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.జగదాంబ అధికారులు, సిబ్బందిని తప్పుబట్టారు. చేసిన పనులకు సక్రమంగా రికార్డులు లేవని, కనీసం పనుల వద్ద బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. అయినప్పటికీ సొమ్ములు మాత్రం డ్రా చేశారని తప్పుబట్టారు. ఉపాధి హామీ పథకంపై మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిక శుక్రవారం జరిగింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.6.46 కోట్ల వ్యయంతో మండలంలో చేసిన 1334 ఉపాధి పనులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష జరిపారు. సమావేశంలో డ్వామా పీడీ జగదాంబ మాట్లాడుతూ ఈ పనుల్లో సుమారు రూ.12 లక్షల మేర అవినీతి జరిగిందన్నారు. పనుల్లో కొలతలు తక్కువగా, కూలీలను ఎక్కువగా చూపించిన ఫీల్డ్ అసిస్టెంట్లకు జరిమానాలు విధిస్తున్నట్టు ప్రకటించారు. చేసిన పనులకు మస్టర్లు లేవని, ఉన్న వాటిపై సంతకాలు లేవని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. చేసిన ఉపాధి పనులకు నేమ్ బోర్డులు ఏర్పాటు చేయకుండానే రూ.1.69 లక్షల సొమ్ములు డ్రా చేసుకున్నారని సమావేశంలో ఆమె ప్రకటించారు. అప్పటికప్పుడు ఆ మొత్తాన్ని ఆమె రికవరీ చేశారు. తమ గ్రామంలో మట్టి పూడికలు చేసి మూడేళ్లయిందని, ఆ బాపతు బిల్లు రూ.14 లక్షలలు ఇంతవరకూ రాలేదని అన్నవరప్పాడు పంచాయతీ సర్పంచ్ పంతం బాల సుందరి డ్వామా పీడీ దృష్టికి తీసుకువెళ్లారు. దాంతో డ్వామా పీడీ రికార్డులు పరిశీలించారు. అందులో రూ.1.58 లక్షలు లెక్కల్లో లేవని తేలడంతో టీఏ శ్రీనివాస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, ఎంపీడీఓ రమేష్, ఏపీడీ అప్పలరాజు, ఎస్‌ఆర్పీ తులసీ నాయక్, హెచ్‌ఆర్ నరేష్ వివిధ శాఖల ఏఈలు, ఎస్‌ఆర్‌పీలు , వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, డ్వాక్రా సీఏలు, వీఏలు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

పిల్లల సహవాసాలపై దృష్టి పెట్టాలి

- నల్లజర్ల సీఐ సున్న రాజు
- బాలికల సంరక్షణపై అవగాహన కార్యక్రమం



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న నల్లజర్ల సీఐ సున్న రాజు

నల్లజర్ల: పిల్లల దిన చర్య, వ్యవహార శైలి, సహవాసాలపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని నల్లజర్ల సీఐ సున్న రాజు సూచించారు. బాలికల సంరక్షణపై శుక్రవారం స్థానిక ఏకేఆర్జీ కళాశాలలో డిగ్రీ, ఫార్మసీ, ఇంటర్, హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల కార్యదర్శి వడ్లమూడి రామారావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. సీఐ రాజు మాట్లాడుతూ దైనందిన జీవితంలో తల్లితండ్రులిద్దరూ ఎంత బిజీగా ఉన్నప్పటికీ పిల్లలను సంస్కారవంతంగా పెంచడం తమ బాధ్యత అని గుర్తించాలన్నారు. గడప దాటితే బాలికలు, యువతులు, మహిళలకు ఎదురయ్యే అనర్థాలపై వారిని పోలీసు శాఖ జాగృతి పరుస్తోందన్నారు. వారికి బయట ఎదురయ్యే సవాళ్లను అధిగమించేలా స్థైర్యాన్ని నింపేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఆడపిల్లలు, మహిళలు దిశ యాప్‌ను వినియోగించాలన్నారు. ఆపద సందర్భాల్లో 100, 112లకు కాల్ చేయాలన్నారు. నల్లజర్ల ఎస్ఐ నరసింహమూర్తి కూడా విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శివరాం, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ రఘువీర వర్మ, ఇంటర్ ప్రిన్సిపాల్ రత్తయ్య,అధ్యాపకులు పాల్గొన్నారు.

పైడిమెట్ట ఎత్తిపోతల నుంచి నీటి విడుదల



పైడిమెట్ట ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

తాళ్లపూడి: నీటి తీరువా బకాయిలను గడువులోగా పూర్తిగా చెల్లించాలని పైడిమెట్ట ఎత్తిపోతల పథకం ఆయకట్టు రైతులను ఆ ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు కోరారు. మండలంలోని ఈ ఎత్తిపోతల పథకం ద్వారా రబీ సాగుకు శుక్రవారం నీటిని విడుదల చేశారు. ఎత్తిపోతల పథకం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరులు స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎత్తిపోతల పథకం ఆయకట్టు 3500 ఎకరాలన్నారు. ప్రస్తుతం రెండు మోటార్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుతం ఒకే ట్రాన్స్‌ఫార్మర్ ఉందని, సుమారు రూ.ఐదు లక్షల వ్యయం తో రెండో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు బండ్రెడ్డి వెంకటేశ్వరరావు, బండ్రెడ్డి సత్యనారాయణ, డైరెక్టర్లు ఇంజరపు మురళీకృష్ణ, ఎత్తిపోతల పథకం సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థులకూ పెద్ద చదువులు



ట్యాబ్‌లు పొందిన ఎనిమిదో తరగతి విద్యార్థినులతో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

- అందులో భాగంగానే 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు
- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- పట్టణంలోని 270 మంది విద్యార్థులకు అందజేత

నిడదవోలు: పేద విద్యార్థి కూడా ఉన్నత చదువులకు ఆర్థికంగా ఇబ్బందులు పడరాదనే ఉద్దేశంతో విద్యా బోధనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పట్టణంలోని ఐదు హైస్కూళ్లకు చెందిన 270 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఆయన ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సీహెచ్ పద్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పేద విద్యార్థులు సైతం ఆధునిక సాంకేతిక ప్రపంచంతో పోటీ పడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉచితంగా ట్యాబ్‌లను అందిస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందులు, ఆకలి బాధలతో విద్యార్థులు బడి మానేసే పరిస్థితులు రాకూడదనే సంకల్పంతో ప్రభుత్వం ఇప్పటికే అమ్మ ఒడి, విద్యా దీవెన, విద్యా వసతి దీవెన, జగనన్న విద్యా కానుక వంటి సంక్షేమ పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, ఎంఈవో గురుమూర్తి, కౌన్సిలర్లు ముంగండి మాణిక్యమాల, పువ్వల రతీదేవి, ఎస్‌కే వజీరుద్దీన్, కొత్తపల్లి సుప్రియ, పడాల శిరీష, గోపిరెడ్డి శ్రీనివాస్, దాకే అనిల్‌కుమార్, హెచ్‌ఎం కృష్ణ కుమారి, పీఈటీలు శాంతి, వీరలక్ష్మి, దుర్గ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సతీష్‌కుమార్‌కు బెస్ట్ ఎస్సై అవార్డు



జిల్లా ఎస్పీ జగదీష్ చేతుల మీదుగా బెస్ట్ అవార్డు అందుకుంటున్న ఎస్సై సతీష్ కుమార్

గోపాలపురం: అక్రమ మద్యం కేసులను ఛేదించడంలో జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిన గోపాలపురం ఎస్సై కె.సతీష్‌కుమార్‌కు ఉత్తమ ఎస్సై అవార్డు లభించింది. రాజమహేంద్రవరం ఎస్పీ పి.జగదీష్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు. ఎస్సై సతీష్ కుమార్‌ను కొవ్వూరు డీఎస్పీ కేఎస్ వర్మ, దేవరపల్లి సీఐ అనసూరి శ్రీనివాస రావు, సిబ్బంది అభినందించారు.

రెండు కుటుంబాలకు బీమా సాయం అందజేత

నిడదవోలు: రెండు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి మంజూరైన వైఎస్సార్ బీమా సాయాన్ని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు శుక్రవారం పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్లో అందజేశారు. వివరాలిలా ఉన్నాయి. స్థానిక గాంధీనగర్‌కు చెందిన క్రొవ్విడి సురేఖకు రూ. 5 లక్షల చెక్కు అందజేశారు. ఆమె భర్త దుర్గా రవికుమార్ గత నవంబర్‌లో తాళ్లపాలెంలో విద్యుదాఘాతానికి గురై మరణించాడు. అలాగే దాసరి నాగయ్య గత నెలలో పాలకొల్లు దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అతడి భార్య అంజమ్మకు రూ.5 లక్షల నగదు చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మరోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- నడుపల్లి ఎస్సీ కాలనీలో గడప గడపకూ..



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

పెరవలి: ఈ ఐదేళ్లలో నిడదవోలు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేశాను. మరోసారి శాసనసభ్యుడిగా గెలిపిస్తే మరిన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని నడుపల్లి పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆ ప్రాంత వాసులు ఎమ్మెల్యేతో మాట్లాడారు. ‘సంక్షేమ పథకాలు అందుతున్నాయి. వాటర్ ట్యాంక్ నిర్మాణంతో తాగునీటి సమస్య తీరింది. కానీ కాలనీ ఏర్పడి 15 ఏళ్లయినా సరైన రోడ్లు, డ్రైన్లు లేకపోవడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఆ రెండు సమస్యలూ పరిష్కరించా’ లని కోరారు. వాటిని త్వరలోనే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు వారికి హామీ ఇచ్చారు. గ్రామంలోని 360 గృహాలను ఎమ్మెల్యే సందర్శించారు. గృహస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఈ గ్రామంలో ఇప్పటి వరకూ రూ.24 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా, మండల శాఖల అధ్యక్షులు పొట్టి రాంబాబు, బీరా రాజు, నడుపల్లి సర్పంచ్ బీరా సత్యవేణి, ఉప సర్పంచ్ అన్నమరెడ్డి రవీంద్రనాథ్ చౌదరి, సొసైటీ అధ్యక్షుడు కరుటూరి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి సాదర స్వాగతం



జగనన్న విద్యా దీవెన (ఫీజు రీయింబర్స్‌మెంట్) నిధుల విడుదలకు శుక్రవారం పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రమైన భీమవరం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పుష్పగుచ్ఛం అందించి సాదర స్వాగతం పలికారు.

– కొవ్వూరు

నేడు మంత్రి ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు

కొవ్వూరు: రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక యువరాజ్ ఫంక్షన్ హాల్లో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నారు. మంత్రి తండ్రి, మాజీ ఎమ్మెల్యే జొన్నకూటి బాబాజీరావు పుట్టిన రోజు వేడుక సందర్భంగా కొవ్వూరు నియోజకవర్గంలోని పాస్టర్లకు నూతన వస్త్రాలు అందజేస్తారు.

ఉత్సాహంగా ‘ఆడుదాం ఆంధ్రా’



అనుమునిలంకలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

నల్లజర్ల: గ్రామ సచివాలయాల పరిధిలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు మూడో రోజైన శుక్రవారం ఉత్సాహంగా కొనసాగాయి. గ్రామ సచివాలయాల సిబ్బంది, వలంటీర్ల పర్యవేక్షణలో పోటీలు జరుగుతున్నాయి. మండల స్థాయి పోటీల్లో సత్తా చాటి నియోజకవర్గ స్థాయి పోటీలకు వెళ్లేందుకు క్రీడాకారులు ఉత్సాహం చూపుతున్నారు. పోతవరం సచివాలయం–1 పరిధిలో ఖోఖో, వాలీబాల్ పోటీలు జరిగాయి. నల్లజర్ల జెడ్పీ హైస్కూల్లో కబడ్డీ , ఏకేఆర్జీ కళాశాల మైదానంలో క్రికెట్ పోటీలు జరిగాయి. అనుమునిలంకలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఎంపీడీఓ రాజశేఖర్, ఈఓపీఆర్డీ సింహాద్రి, తహసీల్దార్ కిశోర్‌కుమార్‌లు ఆయా గ్రామాలో జరుగుతున్న ఆటల పోటీలను పర్యవేక్షించారు.పోటీలను తిలకించడానికి స్థానికులు తరలి వస్తున్నారు.

ప్రక్కిలంకలో వై ఏపీ నీడ్స్ జగన్



ప్రక్కిలంకలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహిస్తున్న సర్పంచ్, నాయకులు

తాళ్లపూడి: మండలంలోని ప్రక్కిలంక సచివాలయం పరిధిలో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆ పార్టీ నాయకులు ఎగురవేశారు. అనంతరం ఈ సచివాలయం పరిధిలో అమలైన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. సర్పంచ్ యాళ్ల స్వప్న ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు గ్రామంలో పర్యటించారు. గత ఐదేళ్ల పాలనలో జగన్ ప్రభుత్వంలో ప్రజలకు అందిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోశిన శ్రీలేఖ, పార్టీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు యాళ్ల బాబురావు, తోట రామకృష్ణ, పిట్టా శ్రీనివాస్, నామా ప్రకాశం, గుంటు చిన్నబ్బాయి, దుర్గారావు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

దేశాభివృద్ధే లక్ష్యంగా మోదీ పాలన



ధర్మవరంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొవ్వూరు: దేశాభివృద్ధే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ పాలన సాగిస్తున్నారని బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. మండలంలోని ధర్మవరం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్రలో ఆయన పాల్గొన్నారు. మోదీ సంక్షేమాన్ని, అభివృద్ధిని రెండింటినీ విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు.ఈ సందర్భంగా వికసిత భారత్ సంకల్పయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. బీజేపీ నాయకులు బూసి సురేంద్రనాథ్ బెనర్జీ, పట్టణ శాఖ అధ్యక్షుడు మడిచర్ల రామచంద్రరావు, స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు జొన్నకూటి రోహిణి కోమలి, వెంపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్పర్శ లేని మచ్చలుంటే గుర్తించాలి

- కుష్టు వ్యాధి గుర్తింపు సర్వే బృందానికి సూచన



నల్లజర్లలో కుష్టువ్యాధిపై సర్వే నిర్వహిస్తున్న వలంటీర్లు , వైద్య,ఆరోగ్య శాఖ సిబ్బంది

నల్లజర్ల: ఎవరి శరీరంపై అయినా స్పర్శలేని మచ్చలు, రాగి రంగు మచ్చలు ఉంటే ఆరోగ్య సిబ్బంది గుర్తించాలని నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టర్ తెల్లం గంగాధరరావు సూచించారు. కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఈ నెల 26న ప్రారంభమైన ఎల్‌సీడీసీ (లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్) సర్వే జనవరి 12 వరకూ కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఇంటిలోని ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలు తెలుసుకుంటారన్నారు. మందమైన మెరిసే జిడ్డు కలిగిన చర్మం ఉండటం, చెవులపై, వీపుపై బొడిపెలు, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, ముక్కు దిబ్బడ, ముక్కు నుంచి రక్తం కారడం, కాళ్ళు, చేతుల తిమ్మిర్లు, అరచేతులు, అరికాళ్లలో స్పర్శ లేకపోవడం వంటి లక్షణాలు ద్వారా కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించవచ్చన్నారు. పై అనుమానిత లక్షణాలు ఉన్నవారి వివరాలను సంబంధిత ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు.